క్లుప్తంగా

ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

హాలియా : నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి 43వ జన్మదిన వేడుకలు బుధవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అట్టహాసంగా జరిగాయి. పెద్దవూర మండలంలోని పిన్నవూర స్టేజీ నుంచి హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (పాత ఐటీఐ) వరకు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అభిమానులు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డికి గజమాల వేసి ఖడ్గం అందజేశారు. అనంతరం క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై అభిమానులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి తన జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. భారీ కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. జైవీర్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పేందుకు నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని నలుమూలల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.

స్పెల్ బీ కాంటెస్ట్‌కు విద్యార్థుల రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న వర్ద్ అండ్ డీడ్ స్కూల్ విద్యార్థులు

మిర్యాలగూడ : సాక్షి ఇండియా స్పెల్ బీ కాంటెస్ట్‌లో పాల్గొనేందుకు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల వర్ద్ అండ్ డీడ్ స్కూల్ విద్యార్థులు బుధవారం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ ఎండీ.కలీమ్ తెలిపారు. కేటగిరీ–1లో ఐదుగురు, కేటగిరీ–2లో 15 మంది, కేటగిరీ–3లో 11 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కండక్టర్‌పై డిపో మేనేజర్‌కు ఫిర్యాదు

కొండమల్లేపల్లి : చింతపల్లి మండల పరిధిలోని కుర్మేడు గ్రామానికి చెందిన కాసాని నరసింహ అనే వ్యక్తి దేవరకొండ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న గుమ్మడవెల్లి వెంకటయ్యపై మేనేజర్‌కు బుధవారం ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్న వెంకటయ్య గతంలో పెరల్స్ అనే కంపెనీలో పనిచేస్తూ తన వద్ద సంవత్సరానికి రూ.31,850 చొప్పున ఐదు సంవత్సరాలకు గాను రూ.1,59,250 కట్టించుకున్నాడని, ఇప్పుడు ఆ డబ్బును తిరిగి ఇవ్వమని అడిగితే పెరల్స్ కంపెనీ ఎత్తేశారని, తనకు ఎటువంటి సంబంధం లేదని అంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పై మొత్తానికి సంబంధించి గతంలో రూ.20 బాండ్ పేపర్‌పై కంపెనీ ఎత్తేస్తే తానే డబ్బులు చెల్లిస్తానని రాసిచ్చాడని, ఇప్పుడు డబ్బులు అడిగితే తనకు సంబంధం లేదని అంటున్నాడని, కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు.

నల్లబెల్లం, పటిక పట్టివేత



పట్టుబడిన నల్లబెల్లం, పటికతో పోలీసులు

డిండి : నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటికను అక్రమంగా తరలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తతండాకు చెందిన కేతావత్ రవి, రమావత్ రమేష్, గడ్డె వెంకటేష్ అనే వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా 26.25 క్వింటాళ్ల నల్లబెల్లం, 200 కేజీల పటికను బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు మండల పరిధిలోని చెర్కుపల్లి గ్రామ శివారులో బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా నల్లబెల్లం, పటిక పట్టుబడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ తెలిపారు.

ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేయాలి

నల్లగొండ టూటౌన్ : ఆస్తి పన్ను వంద శాతం వసూలయ్యే విధంగా బకాయిదారులకు సంబంధించిన సమగ్ర వివరాలతో కార్యాచరణ ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఆస్తి పన్నుపై సమీక్ష నిర్వహించారు. ఏ వార్డులో ఎంత మంది ఆస్తి పన్ను బకాయి పడ్డారు.. ఎవరి ఇంటి పన్ను తక్కువ ఉంది, ఎవరు పన్ను చెల్లించడంలేదు అనే వివరాలు పూర్తిగా వార్డు ఆఫీసర్ల వద్ద ఉండాలని సూచించారు. ఆస్తి పన్ను వంద శాతం వసూలు చేసేవిధంగా శ్రద్ధ పెట్టాలన్నారు. బకాయిలు ఎక్కువగా ఉన్నందున ప్రతి వార్డు ఆఫీసర్ ఉదయం ఏడు గంటలకే వార్డులకు వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తంటాలు

- నెల రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్
- ఇబ్బందులు పడుతున్న 92 గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు



డిండి మండలంలోని ప్రతాప్ నగర్‌లో తాగునీటి కోసం నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

డిండి: మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో డిండి, చందంపేట మండలాల్లోని దాదాపు 92 గ్రామాల ప్రజలు సుమారు నెల రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిండి మండల పరిధి కందుకూర్ గ్రామ శివారులోని వాగు గుండా వేసిన మిషన్ భగీరథ పైపులైన్ ఇటీవల కురిసిన వర్షాలతో ఏర్పడిన వరదల కారణంగా పగిలి పోయింది. దీంతో రెండు మండలాల్లోని దాదాపు 92 గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో నానా బాధలు పడుతున్నారు. తమ సమస్యను తీర్చాలని నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేక..

గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను చెప్పుకునేందుకు సర్పంచులు, ఎంపీటీసీలు లేకపోవడంతో ప్రజలు సంబంధిత అధికారులకు విన్నవించారు. అయినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బులు ఖర్చు చేసి మరీ వాటర్ ప్లాంట్లలో నీటిని కొనుగోలు చేస్తున్నామని, వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తీసుకొని వస్తున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని వేడుకుంటున్నారు.

వర్షాలు తగ్గుముఖం పడితేనే..

వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పగిలిపోయిన మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేపడతాం. ప్రజల నీటి సమస్యను తీరుస్తాం.

– లక్ష్మీనారాయణ, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

ఇబ్బంది పడుతున్నాం



గత నెల రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– బద్దెల సైదులు, డిండి

అధికారులు స్పందించాలి



గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యపై అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలి. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేంత వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

– ఏటి.కృష్ణ, బీజేపీ దేవరకొండ అసెంబ్లీ కన్వీనర్

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర



గారెకుంటపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మాడుగులపల్లి : రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండలంలోని గారెకుంటపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమైనందున రైతులు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. రైతులు దళారుల మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు 17 శాతం తేమ ఉండేలా నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించే సమయంలో తప్పనిసరిగా పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకురావాలని వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, డీసీఎం సోమయ్య, ఏపీఎం మధుసూదన్, మారెపల్లి లక్ష్మీరెడ్డి, లలిత, సలోమి, నాగమణి, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని గుర్రప్పగూడెం, ఆగామోత్కూర్, చిరుమర్తి, పాములపాడు గ్రామాల్లో డీసీఎం సోమయ్య ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్

- అదనపు కలెక్టర్ నారాయణ అమిత్



విద్యార్థినుల పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నారాయణ అమిత్

హాలియా : విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. హాలియాలోని కేజీబీవీని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలోని సమస్యలను గుర్తించి వెంటనే తీర్చాలని జిల్లా విద్యాధికారి భిక్షపతి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హైమావతికి సూచించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కాగా, పాఠశాలకు ఒక కిచెన్ రూం, గ్రౌండ్ లెవెల్ చేయడంతో పాటు ఎలక్ట్రిసిటీ, డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పర్చాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరారు. కార్యక్రమంలో డీఈఓ భిక్షపతి, ఎంఈఓ కృష్ణమూర్తి, తహసీల్దార్ రఘు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం



మిర్యాలగూడ టౌన్ : పోషణ మాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ మమత



గుర్రంపోడు : అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ

మిర్యాలగూడ టౌన్: బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలను పట్టిస్తే ఎంతో ఆరోగ్యమని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖల మమత అన్నారు. మిర్యాలగూడ మండలంలోని చిల్లాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బిడ్డకు కచ్చితంగా ఆరు నెలల పాటు తల్లి పాలను పట్టించాలని సూచించారు. అదే విధంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో వ్యక్తిగత పరిశుభ్రతపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు ఆరు నెలలోపు వయసు ఉన్న చిన్నారుల గృహాలను సందర్శించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆహారంలో రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు, సామలు, అరికెలు వంటి చిరు ధాన్యాలను తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.వాణి, పోషణ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ కవిత, అంగన్‌వాడీ టీచర్ సైదమ్మ, ఆయా సుజాత, ప్రభుత్వ స్కూల్ టీచర్ శ్రీనివాస్, ఏఎన్ఎం పద్మ, జి.జ్యోతి, ఆశా వర్కర్ వెంకటరమణ, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

గుర్రంపోడు: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొప్పోలు ప్రాథమిక పాఠశాలలో కిశోర బాలికలకు, వారి తల్లులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలని, ప్రతి రోజు ఆహారంలో ఆకుకూరలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆయాలు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రి ఎదుట ఆందోళన

నల్లగొండ టౌన్ : తమ కుమారుడి మృతికి డాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ, అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం బాలుడి బంధువులు ప్రకాశం బజార్‌లోని ప్రైవేటు పిల్లల ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. బాలుడి తండ్రి గణేశ్ బీజేపీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ గ్రామానికి చెందిన దొండ గణేశ్, శిరి దంపతుల నెలన్నర బాబుకు జ్వరం రావడంతో మంగళవారం రాత్రి ప్రకాశం బజార్‌లోని అనురాగ్ పిల్లల ఆస్పత్రికి తీసుకువచ్చారు. రాత్రి బాలుడిని పరీక్షించిన డాక్టర్.. చికిత్స చేసి ఆస్పత్రిలోనే ఉంచాలని సూచించారు. బుధవారం ఉదయం వచ్చిన డాక్టర్.. బాలుడిని పరీక్షించి పరిస్థితి సీరియస్‌గా ఉందని ఐసీయూలో వెంటిలేషన్‌పై ఉంచాలని చెప్పి రూ.15 వేల ఫీజు కట్టించుకున్నారు. ఫీజు చెల్లించిన తరువాత బాలుడు చనిపోయాడని డాక్టర్ తమకు చెప్పారన్నారు. బాలుడి మృతికి పూర్తి బాధ్యత డాక్టర్‌దే అని వారు ఆరోపించారు. ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చచెప్పి ఆందోళన విరమింపజేయించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న చల్లా గంగమ్మ ఫౌండేషన్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణ పరిధిలోని గొల్లగూడేనికి చెందిన పలువురికి చల్లా గంగమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. విదేశాల్లో ఉంటున్న చల్లా పవన్ అనే వ్యక్తి, అతని స్నేహితుడు చక్రి కలిసి చల్లా గంగమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష సమకూర్చగా, ఆ మొత్తాన్ని పవన్ తల్లిదండ్రులు చల్లా వెంకన్న–లక్ష్మి దంపతులతో పాటు ఫౌండేషన్ సభ్యులు గొల్లగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారితో పాటు పేదల బాలికల చదువు కోసం, పేద యువతుల వివాహ ఖర్చుల కోసం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ విదేశాల్లో ఉంటూ పుట్టిన గడ్డకు తమ వంతు సాయం అందించాలనే ఆలోచనతో పవన్, చక్రిలు ఆర్థిక సాయం చేశారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చల్లా నాగలక్ష్మి, వెంకన్న, దారం మల్లేష్ యాదవ్, బొడ్డు రమేష్, సైదులు, వెంకటరామయ్య, పచ్చిపాల నర్సింహ, చల్లా వెంకన్న, చల్లా నర్సింహ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ధర్నా

త్రిపురారం : మండల వ్యాప్తంగా రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. మండల కేంద్రానికి బుధవారం వివిధ గ్రామాల నుంచి యూరియా కోసం రైతులు తరలి వచ్చారు. యూరియా అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట సాగర్ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం రైతులకు పోలీసులు సర్ది చెప్పి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద యూరియా టోకెన్లు అందించారు. చివరి రైతులకు యూరియా అందకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు. యూరియా సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఆదమరిస్తే అంతే..

- పాఠశాల పక్కన నీటి కుంటతో విద్యార్థులకు పొంచి ఉన్న ముప్పు
- ప్రహరీ నిర్మించాలని తల్లిదండ్రుల వేడుకోలు



పాఠశాల భవనాన్ని ఆనుకొని ఉన్న నీటి కుంట

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కొత్తబావి గ్రామంలో ప్రాథమిక పాఠశాల పక్కన ఉన్న నీటి కుంటతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటి కుంట నిండిపోయింది. నీటి కుంట పాఠశాల భవనాన్ని ఆనుకొని ఉండడంతో విద్యార్థులు అందులో పడిపోయే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో 5వ తరగతి వరకు మొత్తం 24 మంది విద్యార్థులు చదువుతుండగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. ఎటువంటి ప్రమాదం జరుగక ముందే పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని సంబంధిత అధికారులను కొత్తబావి గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణానికి చర్యలు

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కొత్తబావి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆనుకొని ఉన్న నీటి కుంట నిండి అలుగు పోస్తోంది. తక్షణమే మాజీ సర్పంచ్‌తో మాట్లాడి నీటికుంటకు గండి కొట్టించి నీటిని బయటకు పంపించే విధంగా చర్యలు చేపట్టాం. అంతేకాకుండా పై అధికారులతో మాట్లాడి శాశ్వత పరిష్కారంగా పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

– ఆర్. నాగేశ్వర్‌రావు నాయక్, ఎంఈఓ

జీజీహెచ్ ఎదుట బాధితుల ఆందోళన

నల్లగొండ టౌన్: గర్భంలోనే పసికందు మరణించిన సంఘటన బుధవారం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. దీనికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని బాధితురాలి బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. న్యాయం చేయాలని నినాదాలు చేశారు. దీంతో టూటౌన్ పోలీసులు వచ్చి ఆందోళన విరమింపజేయించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. గుర్రంపోడుకు చెందిన రేణుక 8 నెలల గర్భంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం ఉదయం వచ్చింది. నొప్పులు వస్తున్నాయని తనను అడ్మిట్ చేసుకోవాలని వైద్యులను ఆమె కోరింది. గత రిపోర్టులు, స్కానింగ్ వివరాలు పరీక్షించిన వైద్యులు.. కాన్పు తేదీ డిసెంబరులో ఉండడంతో నొప్పులకు మందులు రాశారు. కాన్పు అయ్యేందుకు సమయం ఉన్నందున వారం ముందు రావాలని ఆమెకు సూచించారు. అనంతరం రేణుక ఉదయం 9 గంటలకు వెళ్లి టిఫిన్ చేయగానే నొప్పులు రావడంతో ఆస్పత్రికి వచ్చింది. స్పందించిన డాక్టర్లు ఆమెకు స్కానింగ్ చేయగా కడుపులో బిడ్డ చనిపోయిందని నిర్ధారణ చేశారు. శిశువును బయటకు తీయకుంటే తల్లి ప్రాణానికి హాని ఉందని, ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. తల్లి క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి తెలిపారు. ఆమెకు ఎలాంటి వైద్య పరీక్ష చేయలేదని, మంగళవారం నాడే కడుపులో శిశువు మృతి చెందిందని వివరించారు.

ఆదాయ వృద్ధిపై అధికారుల కసరత్తు

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో వ్యాపార లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టి



మిర్యాలగూడ పట్టణంలో దుకాణాలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మున్సిపాలిటీలో వ్యాపారుల లైసెన్స్ రుసుము ద్వారా ఆదాయం పెంచుకునేందుకు మున్సిపల్ అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. గత కొంత కాలంగా పూర్తిస్థాయిలో ఈ విషయంపై ప్రత్యేక దృష్టిని సారించకపోవడంతో ఆదాయానికి పెద్ద మొత్తంలో గండిపడుతుందని అధికారులు భావిస్తున్నారు. వాణిజ్య, మిశ్రమ వినియోగం (వాణిజ్యం, గృహం కలిసి ఉన్నవి) ఆస్తుల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి చేశారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అధికారులు క్షేత్రస్థాయిలో ట్రేడ్ లైసెన్స్‌లు లేనివారిని గుర్తించే విధంగా వార్డు ఆఫీసర్లు చర్యలు చేపట్టారు. వాటికి లైసెన్స్‌లను తీసుకునేలా వ్యాపారులకు అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

ఫీజులు ఇలా..

- రోడ్డు వెడల్పు ఆధారంగా వాణిజ్య, వ్యాపార దుకాణాలకు పొడవు, వెడల్పు కొలతలు చేపడుతున్నారు. సాధారణం అయితే ఒక చదరపు అడుగుకు రూ.5 చొప్పున లెక్కిస్తున్నారు.
- ఒక్కొక్క దుకాణానికి వ్యాపార లైసెన్స్ సుమారు రూ.200 నుంచి రూ.50 వేలు, రూ.లక్ష వరకు ఉంటుంది. దీనికంటే ఎక్కువ మొత్తం వేయడానికి వీలు లేకుండా శ్లాబ్ విధించారు.
- ఆస్తి పన్నుల మాదిరిగానే ప్రతి సంవత్సరం దుకాణాలకు వ్యాపార లైసెన్స్‌ల ఫీజులు చెల్లించకుంటే జరిమానా విధిస్తారు.
- ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే లోపు చెల్లించే వారికి ఎలాంటి అపరాధ రుసుము ఉండదు.
- ఆ తర్వాత పునరుద్ధరించుకోవడానికి దరఖాస్తులు చేస్తే 25 శాతం మేర జరిమానా వేస్తున్నారు.

మున్సిపాలిటీ మొత్తం ట్రేడ్ లైసెన్స్‌లు – 1758
నూతనంగా దరఖాస్తు చేసుకుంది – 30 మంది
క్షేత్రస్థాయిలో ట్రేడ్ లైసెన్స్ లేనివారు – సుమారు 2 వేల మంది
ప్రస్తుతం ట్రేడ్ లైసెన్స్ ఆదాయం – రూ.40 లక్షలు

సమస్యలు ఇవే..

- ఆన్‌లైన్‌లో కనిపిస్తున్న దుకాణాలు, సంస్థలు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు.
- లైసెన్స్ వివరాలు ఒకసారి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత వాటిని మార్చడం సాధ్యం కావడం లేదు. దీంతో వ్యాపారి పేరుపై, ఇంటి పేరుపై ట్రేడ్ లైసెన్స్ చార్జీలు నమోదు అవుతూనే ఉన్నాయి.
- కొందరు వ్యాపార పరంగా దెబ్బతిని కొంత కాలం దుకాణాలను మూసివేసి తర్వాత కొత్తగా ప్రారంభిస్తున్నారు.
- కొత్త వ్యాపారం చేయాలనుకునే వారు లైసెన్స్‌లను తీసుకోవాలంటే పాత వ్యాపారం లైసెన్స్‌కు సంబంధించిన ఫీజు బకాయిలు తప్పనిసరిగా అధికారులు కట్టించుకుంటున్నారని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి



ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. వార్డు ఆఫీసర్ల ద్వారా మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో క్షేత్రస్థాయిలో వివరాలను తీసుకుంటున్నాం. ఎవరైనా ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుంటే వారికి అవగాహన కల్పిస్తున్నాం. అదేవిధంగా కొన్ని రోజుల పాటు వ్యాపారం చేసి ఆ తర్వాత మానేసి తిరిగి వ్యాపారం చేసే వారు పెండింగ్ ఫీజులను చెల్లించిన తర్వాత వారు నూతనంగా లైసెన్స్ తీసుకునే విధంగా చర్యలు చేపడుతున్నాం.

– జి.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

అలుగు పారుతున్న నిడమనూరు చెరువు



అలుగు పారుతున్న నిడమనూరు చెరువు

- నిడమనూరు–బంకాపురం రోడ్డులో లో లెవెల్ కల్వర్టుపై భారీగా నీటి ప్రవాహం
- నిలిచిన రాకపోకలు

నిడమనూరు : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నిడమనూరు చెరువు భారీగా అలుగు పారుతోంది. నీటి ప్రవాహంతో నిడమనూరు–బంకాపురం రోడ్డులో ఉన్న లో లెవెల్ కల్వర్టుపై నుంచి మూడు అడుగులకు పైగా వరద ప్రవహిస్తోంది. దీంతో ఆ రోడ్డులో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చెరువు దిగువన ఉన్న అలుగు కింద పొలాలకు, నివాసాలకు రాకపోకలు సాగేందుకు నిర్మించిన కల్వర్టు డిజైన్‌కు భిన్నంగా ఉండడంతో అలుగు నీటి ప్రవాహం పూర్తిస్థాయిలో వెళ్లకుండా అడ్డుకోవడంతో నీరు పల్లపు ప్రాంతాలు, పక్కనే ఉన్న నివాసాల్లోకి ప్రవహిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇష్టానుసారంగా నిర్మాణాలతో..

నిడమనూరు చెరువు నుంచి గతంలో ఊరికి రెండు వైపులా ఉన్న కాల్వల (బందాలు) ద్వారా నీరు సమానంగా ప్రవహించేది. అయితే, ఇటీవల చేపట్టిన నిర్మాణాలతో బంకాపురం రోడ్డు వైపు వరద భారీగా ప్రవహిస్తోంది. ఈ ఏడాది వర్షాకాలంలో ఐదు పర్యాయాలు లో లెవెల్ కల్వర్టుపై నీరు ప్రవహించింది. అంతేకాకుండా చెరువు అలుగు సమీపంలో రైతు వేదిక వద్ద నిర్మించిన బ్రిడ్జి కూడా అధికారులు సూచించిన విధంగా కాకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిర్మించారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు

మండలంలోని ఊట్కూరు బ్రిడ్జి నిర్మాణంలో ఉండగా రాకపోకలకు అనువుగా డైవర్షన్ రోడ్డు నిర్మించారు. మారుపాక, వెంకటాపురం చెరువులు, వాగుల నుంచి వస్తున్న నీటి ప్రవాహంతో రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఊట్కూరు నుంచి ముప్పారం, నందికొండవారిగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.